ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 21 ఏప్రిల్ 2025

ఉప్పొంగిన అభిమానం

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



సీఎం చంద్రబాబు భారీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా చేసుకున్నారు. ఎక్కడ చూసినా టీడీపీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు, కేక్‌లు కట్ చేస్తూ ఆనందం పంచుకున్నారు. చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

అనంతపురం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ మేయర్ స్వరూప, అనంతపురం అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ, దేవళ్ల మురళీ, గంజే నాగరాజు , నాయకులు కూచి హరి, సరిపూటి రమణ, సుధాకర్‌నాయుడు, కృష్ణకుమార్, సిమెంట్ పోలన్న, పీఎం లక్ష్మీప్రసాద్, స్వప్న, విశాలాక్షి, సంగా తేజస్విని, సరళ, కురబ నారాయణస్వామి, మణికంఠ బాబు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ఎంపీ అంబికా, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతలో కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలు

75 అడుగుల కటౌన్..

అనంతపురంలోని క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు 75 అడుగుల భారీ కటౌట్‌కు క్రేన్ సాయంతో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ క్షీరాభిషేకం చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన 75 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. అంతకు ముందు అనంతపురం అర్బన్ కార్యాలయం నుంచి క్లాక్ టవర్ దాకా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

విజయాలకు పొంగిపోడు.. అపజయాలకు కుంగిపోడు

రామగిరిఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయకుడు విజయాలకు పొంగిపోడు.. అపజయాలకు కుంగిపోడని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని తిరుమల దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడే నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రమశిక్షణ, అంకితబావం ఉన్ననాయకుడు చంద్రబాబు అన్నారు. అనంతరం అనంతపురంలోని నివాసంలో మనవడు జూనియర్ పరిటాల రవీంద్ర, మనవరాలు పరిటాల అమైరా రవీంద్రతో కలిసి కేక్ కట్ చేశారు.



అనంతపురంలోని నివాసంలో మనవడు, మనవరాలితో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

సేవా కార్యక్రమాలు



రోగులకు పానీయం పోస్తున్న ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

పుట్లూరు(ఆంధ్రజ్యోతి): పుట్లూరులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కేక్ కట్ చేశారు. అక్కడే ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. రోగులకు శీతల పానీయాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

తాడిపత్రిలో..



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసంలో ఆదివారం నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వయస్సులో కూడా చంద్రబాబు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తుండడం గొప్ప విషయమన్నారు. అభివృద్ధి ఎలా చేయాలో ఆయనకే తెలుసన్నారు.

గుంతకల్లులో..



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన టీడీపీ నాయకులు మెయిన్ రోడ్డులోని అన్న క్యాంటీన్ వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు పాల్గొన్నారు.

నార్పలలో..



నార్పలలో అన్నదానం చేస్తున్న ఆలం నరసానాయుడు

నార్పల,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి బస్టాండుకు ర్యాలీ చేశారు. అక్కడ కేక్ కట్ చేశారు. శ్రీ సత్యసాయి అనాథ శ్రమం, కురగానిపల్లిలో చెన్నకేశవ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

కళ్యాణదుర్గంలో..



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేక్ కట్ చేసి, స్వీట్లను పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడి సారథ్యంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భావితరాలకు ఓ స్ఫూర్తి దాతగా చంద్రబాబునాయుడు నిలుస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకల్లో పాల్గొన్నారు.

తవ్వుకోండి.. తోలుకోండి..



వెంకటాపురం వద్ద కొండలో మట్టి తవ్వి, తరలిస్తున్న దృశ్యం

శింగనమల నియోజకవర్గంలో ఇసుక, మట్టి మాఫియా

- విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు, రవాణా
- కొండలను పిండిచేస్తున్నవైనం
- ప్రభుత్వం మారినా వైసీపీ నాయకులదే పెత్తనం
- సహకరిస్తున్న కూటమి నేతలు
- చోద్యం చూస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. మట్టి కోసం ఏకంగా కొండలు, గుట్టలను తవ్వేస్తున్నారు. టిప్పర్లతో పబ్లిక్‌గానే తరలిస్తున్నారు. నల్ల మట్టినీ వదలట్లేదు. ఇసుక కూడా అంతే. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తూనే ఉన్నారు. ఆ వాహనాలన్నీ బుక్కరాయసముద్రంలోని పోలీసు స్టేషన్ ముందు నుంచే అనంతపురానికి చేరుకుంటున్నాయి. అయినా.. పోలీసులు ఆపట్లేదు. తనిఖీలు చేయట్లేదు. పోలీసులకు పెద్ద ఎత్తున మామూళ్లు ముడుతుండడంతోనే వారు పట్టించుకోవట్లేదన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గనులు, విజిలెన్స్ అధికారులు కూడా ఇటువైపు కన్నెత్తి చూడట్లేదు. చుట్టపు చూపుగా.. అది కూడా ఫిర్యాదులు అందినపుడు మాత్రం దాడులు చేసి.. చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. విచిత్రమేమిటంటే ప్రభుత్వం మారినా వైసీపీ నాయకులే మట్టి మాఫియా నడిపిస్తున్నారు. వారికి కూటమి నేతలు సహకరిస్తుండడంతో అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని తెలుస్తోంది.



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

అక్రమంగా తరలించే ప్రాంతాలివే...!

శింగనమల నియోజకవర్గంలో ఇసుక వనరులు పుష్కలంగా ఉన్నాయి. మండలంలో ప్రధానంగా రాచేపల్లి, తరిమెల, ఉల్లికల్లు, పోతరాజు కాలువ, పెరవలి, కల్లుమడి, నిదనవాడ, జూలాకాలువ, రాచేపల్లి, బుక్కరాయసముద్రం పరిధిలో చెదళ్ల, నీలంపల్లి, వడియంపేట, గోవిందంపల్లి, రేగడికొత్తూరు, గార్లదిన్నె మండలంలో ఇల్లూ రు పరిధిలో ఇసుక లభిస్తోంది. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం, సిద్దరాంపురం, నారాయణప్పకుంట, కొర్రపాడు, శింగనమల మండలంలోని పలు గ్రామాల పరిధిలో మట్టి తవ్వుతున్నారు. యథేచ్ఛగా తరలిస్తున్నారు.

వైసీపీ నాయకులదే పెత్తనం...!

గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ఇసుక, మట్టి దోపిడీ చేశారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేతలే మట్టి దోపిడీ సాగిస్తుండడం గమనార్హం. పుట్లూరు మండలంలోని చాలివేముల గ్రామంలో ఏకంగా కొండను పిండి చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో తవ్వి, అక్రమంగా తరలిస్తున్నారు. ఇద్దరు వైసీపీ సర్పంచ్‌లు మాఫియా నడిపిస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీలోని కొంతమంది సహకరిస్తుండడంతో వారికి అడ్డేలేకుండా పోయిందని తెలిసింది. పోలీసు శాఖలో ఓ అధికారికి ప్రతినెలా పెద్ద మొత్తంలో ముట్టజెపుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని టీడీపీ నేతలే వాపోతున్నారు. టిప్పరు నల్లమట్టి రూ.7 వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారు. అరటి పంటకు నల్ల మట్టి ఉపయోగిస్తుండడంతో డిమాండ్ భారీగా పెరిగింది.

గనుల అధికారుల దాడులు

బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామం వద్ద మట్టి మాఫియా అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తుంటే గనుల అధికారులు దాడులు చేశారు. ఎర్రమట్టి మాఫియా నిర్వాహకుడికి, స్థానికంగా ఉన్న ఓ కుల సంఘం నాయకుడి మధ్య వివాదం తలెత్తడంతో చివరికి గనుల అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు దాడులు చేసి, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు తెలిసింది. నిత్యం గ్రామ సమీపాన రెండు ఎక్స్‌కవేటర్లు, 8 టిప్పర్లు పెట్టి అక్రమంగా మట్టి తవ్వి, తరలిస్తున్నట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



దయ్యాలకుంటపల్లి వద్ద ఎర్రమట్టి తరలిస్తున్న దృశ్యం

ఇసుక, ఎర్రమట్టి రవాణాను అడ్డుకుంటాం

శింగనమల నియోజకవర్గంలో ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి, దాడులు చేస్తాం. అక్రమ రవాణాదారులకు పోలీసులు సహకరిస్తున్నట్లు తేలితే విచారణ చేస్తాం. రాప్తాడు, ఇటుకలపల్లి తదితర చోట్ల దాడులు చేసి, కేసులు నమోదు చేశాం.

- వెంకటేశ్వర్లు, అనంతపురం రూరల్ డీఎస్పీ

ఉచితం మాటున దోపిడీ

కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీనిని ఇసుక మాఫియా అదునుగా తీసుకుంది. యథేచ్ఛగా మట్టి, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతోంది. పర్యవేక్షించాల్సిన గనులు, విజిలెన్స్, పోలీసు అధికారులు గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వంలో కేసుల నమోదు తగ్గిపోవడమే ఇందుకు నిదర్శనం.

క్యారెట్‌తో కాసుల పంట

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

- అరకొర నీరే చాలు
- మంచి దిగుబడులతో అన్నదాతల హర్షం
- ధర తక్కువగా ఉన్నా.. ఆదాయం అదుర్స్



శుభ్రం చేసేందుకు డ్రమ్ములో వేసిన క్యారెట్

గుత్తిరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): క్యారెట్ పంట రైతన్నలకు సిరులు కురిపిస్తోంది. మంచి దిగుబడులు రావడంతో అన్నదాతకు లాభాల పంట పండింది. తక్కువ పెట్టుబడి, అరకొర నీటితోనే పంట పండించారు. ధర తక్కువగా ఉన్నా.. లాభాలు వస్తున్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన పలువురు రైతులు క్యారెట్ పంట సాగు చేశారు. దిగుబడులు ఆశాజకంగా వచ్చాయి. మార్కెట్‌లో ఆశించిన ధర లేకున్నా.. లాభాలు కురుస్తున్నాయి. ఎకరాలో పంట సాగుకు రూ.5 వేల నుంచి రూ.6వేలలోపే పెట్టుబడి పెడితే.. ఏకంగా రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పంటను తొలగిస్తున్న కూలీలు

వేరుశనగతో నష్టపోయి..

ఇసురాళ్లపల్లి రైతులు ఏటా రబీలో వేరుశనగ పంట వేసి, తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది కూడా చాలామంది రైతులు వేరుశనగ సాగు చేసి నష్టాలు మూటగట్టుకున్నారు. ఐదుగురు రైతులు మాత్రం క్యారెట్ సాగు చేసి, మంచి దిగుబడులు సాధించారు. ఒక్కో రైతు ఎకరా, అరెకరా, సెంట్ల విస్తీర్ణంలో పంట పెట్టారు. ఎకరాలో పంట సాగు చేయాలంటే విత్తనానికి రూ.4 వేలు, బస్తా ఎరువు రూ.1,250తో పెటుబడి పెట్టారు. మొత్తంగా రూ.5 వేలకుపైగా ఖర్చవుతుంది. వ్యవసాయ బోర్లలో వస్తున్న అరకొర నీటితో, డ్రిప్పు సాయంతో మూడు రోజులకోసారి తడులు ఇస్తారు. క్యారెట్ పంటకు చీడపీడలు ఆశించవు. 70 రోజులకు పంట చేతికి వస్తుంది. ప్రస్తుతం పంటను తొలగిస్తున్నారు. క్యారెట్లను తీసి, కొమ్ములను వేరు చేసి, డ్రమ్ములో నీటితో శుభ్రం చేసి ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర కిలో రూ.15 పలుకుతోంది. ధర ఆశించిన దాని కన్నా తక్కువగా ఉన్నా.. దిగుబడి బాగుండడంతో లాభాలు వస్తున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.



తక్కువ నీటితో మంచి దిగుబడి



రెండెకరాల్లో ఏటా వేరుశనగ సాగు చేసేవాడిని. ఈ ఏడాది బోరులో అరకొరగా నీరు వస్తుండడంతో వేరుశనగ సాగు చేయలేదు. 20 సెంట్లలో డ్రిప్పు సాయంతో క్యారెట్ పంట పెట్టా. మంచి దిగుబడి వచ్చింది. రోజూ రెండు, మూడు బాక్సుల్లో మార్కెట్‌కు తరలిస్తున్నా. రూ.40వేలు లాభం వచ్చింది.

- శేఖర్, రైతు, ఇసురాళ్లపల్లి

పెట్టుబడి తక్కువ



ఇతర పంటలతో పోలిస్తే క్యారెట్ పంటకు పెట్టుబడి తక్కువ. దిగుబడి అధికంగా వస్తుంది. అరెకరాలో పంట సాగుకు రూ.3 వేలు పెట్టుబడి పెట్టా. మంచి దిగుబడి వచ్చింది. ధర మరింత ఎక్కువగా ఉంటే బాగుండేది.

- తిరుమలయ్య, రైతు, ఇసురాళ్లపల్లి

దూసుకొచ్చిన మృత్యువు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఒకరికి గాయాలు



ప్రమాద స్థలంలో వెంకటేష్ నాయక్, శాంతమ్మ మృతదేహాలు



శాంతమ్మ, వెంకటేశ్‌నాయక్, ప్రవల్లిక (ఫైల్)

ఉరవకొండ, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఆదివారం రెండు వేర్వేరు రోడ్డు ప్రవమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఉరవకొండ-గుంతకల్లు రహదారిలో హంద్రీనీవా కాలువ వద్ద స్కూటర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో జిల్లాలోని వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతాండాకు చెందిన వెంకటేష్ నాయక్(51), ఉరవకొండకు చెందిన శాంతమ్మ(33) మృతిచెందారు. శాంతమ్మ పుట్టినిల్లయిన వజ్రకరూరు మండలం ప్యాపిలికి పని నిమిత్తం వెళ్లింది. తిరిగి ఉరవకొండ వచ్చేందుకు ఆదివారం ప్యాపిలి క్రాస్‌కు చేరుకుని, బస్సు కోసం వేచి చూస్తోంది. అదే సమయంలో వెంకటేష్ నాయక్ స్వగ్రామం నుంచి పని నిమిత్తం ఉరవకొండకు బైక్‌పై వస్తుండగా.. లిఫ్ట్ అడిగింది. ఇద్దరూ బైక్‌పై వస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. మృతదేహాలను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. వెంకటేష్ నాయక్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అతడి భార్య సోమునాయి అలియాస్ లక్ష్మీదేవి ఏడాది క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. వెంకటేష్ నాయక్ పెద్ద కుమార్తె యశోద తిరుపతిలో పీజీ చదువుతోంది. చిన్న కుమార్తె నిర్మల దివ్యాంగురాలు. తండ్రి మరణంతో వారు అనాథలయ్యారు. శాంతమ్మ భర్త వన్నూరుస్వామి ఉరవకొండలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. భార్య మరణ వార్త విని వన్నూరుస్వామి కన్నీరుమున్నీరైయ్యాడు. శాంతమ్మకు కుమారుడు ఉన్నారు.

భార్య మృతి.. భర్తకు గాయాలు

ఉరవకొండ పట్టణ పరిధిలోని చాబాల రోడ్డులో బైక్‌ను ఆటో వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో స్టాఫ్ నర్స్ ప్రవల్లిక (31) మృతిచెందగా.. ఆమె భర్త మల్లికార్జున గాయపడ్డాడు. ఉరవకొండలోని 11వ వార్డుకు చెందిన దంపతులు పని నిమిత్తం మండలంలోని చాయపురానికి బయల్దేరారు. చాబాల రోడ్డులోకి వెళ్లగానే.. ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో గాయపడిన దంపతులను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రవల్లిక మరణించినట్లు వైద్యులు తెలిపారు. మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రవల్లిక అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తుండేవారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాలను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదాలపై కేసులు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

పోక్సో కేసు నమోదు

చిలమత్తూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై 75 ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి యత్నించాడు. హిందూపురం డీఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన ఏడేళ్ల బాలికను శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధుడు చిరుతిళ్ల ఆశ చూపి, తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. అసభ్యకరంగా ప్రవర్తించి, అఘాయిత్యానికి యత్నించాడు. చిన్నారి ఏడ్చుకుంటూ వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు వృద్ధుడి ఇంటికెళ్లి, అతడిని పట్టుకున్నారు. పోలీసులు వచ్చి, వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. బాధిత చిన్నారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో జిందాల్ కార్మికుడి మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామ శివారులో ఉన్న జిందాల్ కర్మాగారంలో పనిచేసే ఓ కార్మికుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మద్యం ఎక్కువగా తాగి మృతి చెందాడా..? లేక ఎవరైనా హతమార్చారా అనే విషయాలు తేలాల్సి ఉంది. విషయం తెలుసుకున్న బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన మేరకు.. మృతుడు జార్ఖండ్ రాష్ట్రం ఛత్ర జిల్లా ఖర్మహీ గ్రామానికి చెందిన అభిషేక్‌బుయాన్(36)గా గుర్తించారు. అభిషేక్‌బుయాన్‌తో పాటు అతడి తమ్ముడు గణేష్‌బుయాన్ ఇద్దరూ కొంత కాలం నుంచి జిందాల్ కర్మాగారంలో పనిచేస్తున్నారు. అభిషేక్‌బుయాన్‌కు మద్యం అలవాటు ఎక్కువగా ఉందని, ఈనెల 14న వచ్చిన జీతంతో విపరీతంగా మద్యం తాగి గత మూడురోజుల నుంచి ఫ్యాక్టరీలో పనికి రాలేదని తమ్ముడు గణేష్‌బుయాన్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాపక్షపాతి చంద్రబాబు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాపక్షపాతి అనీ, ప్రజాసంక్షేమమే ఆయన ధ్యేయమ ని ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం అనంతపురం బ స్టాం డు ఆవరణలో పూల నాగరాజు కేక్ కట్‌చేసి, సంబరాలు చేసుకున్నారు. ఆ య న మాట్లాడుతూ... తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారనీ, అం దు కే ఆయన పుట్టినరోజును రాష్ట్రమంతా పండుగలా చేసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, కా ర్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డి పో అధ్యక్షకార్యదర్శులు గోపాల్ చౌదరి, జయప్రకాష్, మల్లికార్జున పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పూల నాగరాజు

పండుగ వచ్చిందే..!

మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ విడుదల

గత ఐదేళ్లు నీరుగార్చిన జగన్

మాట ఇచ్చినట్టే అమలు చేసిన కొత్త ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలో 811 పోస్టులు

నిరుద్యోగులు, ఆశావహుల్లో ఆనందం

మే 15 వరకూ దరఖాస్తులు... జూన్ 6 నుంచి పరీక్షలు



కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

అనంతపురం విద్య, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): వచ్చిందే.. పండుగ వచ్చిందే అంటూ నిరుద్యోగులు, ఆశావహ అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత జగన్ ప్రభుత్వంలో డీఎస్సీ కోసం ఎదురు చూసి... ఆశలు ఆవిరైన అభ్యర్థులకు కొత్త ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామని ప్రకటన చేయడంతో సంతోషం మొదలైంది. ఇచ్చిన మాట మేరకు ఆదివారం మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఆశావహుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 811 పోస్టులు భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు ఇలా...

నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 811 పోస్టులు భర్తీ చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖలో గవర్నమెంట్, జిల్లాపరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 807 పోస్టులు చూపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు 37, హిందీ 18, ఇంగ్లిష్ 103, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, బయాలజీ 72, సోషల్ 111, ఫిజికల్ ఎడ్యుకేషన్ 145 పోస్టులు, ఎస్‌జీటీ పోస్టులు 202 పోస్టులు భర్తీ చేయనున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో 4 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను రోస్టర్ వారీగా రెండు రోజుల కిందట జిల్లా విద్యాశాఖాధికారులు కలెక్టర్ ఆమోదం తీసుకుని విద్యాశాఖ కమిషనరేట్‌కు పంపారు.

నీరుగార్చిన జగన్ సర్కారు

ఉపాధ్యాయ పోస్టుల అభ్యర్థుల ఆశలపై గత జగన్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. 2019-2024 వరకూ ఈ ఐదేళ్లూ... డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ లక్షలాది మంది నిరుద్యోగులను ఊరించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలంటూ నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు గళం విప్పినా... గొంతు నొక్కారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు, ధర్నాలు చేసినా... బలవంతంగా పోలీసులతో కేసులు పెట్టించారు. గత ఐదేళ్లూ ఇదే అరాచకం నడిపించారు. తీరా ఎన్నికల ముందు 2014లో డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ హడావుడి చేశారు. అప్పుడు కూడా బొటాబొటి పోస్టులు చూపించి, లక్షలాది మంది నిరుద్యోగుల ఓట్లను దండుకోవాలనుకున్నారు. నిరుద్యోగులు జగన్ కుట్రలను తిప్పికొట్టారు. జగన్‌ను ఎన్నికల్లో బుద్ధి చెప్పి, కొత్త సర్కారుకు గేట్లు తెరిచారు.

నిరుద్యోగుల్లో సంబరం

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే... సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. మెగా డీఎస్సీ కింద 16347 పోస్టులు భర్తీ చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారు. మాట ఇచ్చినట్టుగానే ఆదివారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించారు. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం మొదలైంది. ఇప్పటికే ప్రిపరేషన్‌లో ఉన్న నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు అటు సీఎం చంద్రబాబునాయుడు, ఇటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

గడువు పొడిగిస్తే బాగుంటుంది..

- చిన్న క్రిష్ణయ్య, డీఎస్సీ అభ్యర్థి, కర్నూలు జిల్లా



మాది కర్నూలు జిల్లా. ఇప్పటికే డిగ్రీ, బీఈడీ పూర్తి చేశా. కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నా. గత ప్రభుత్వం అదిగో... ఇదిగో అంటూ నిరుద్యోగులతో ఆటలాడింది. చంద్రబాబు సీఎం అయిన వెంటనే మొదటి ఫైల్ కింద మెగా డీఎస్సీ ఫైల్‌పై సంతకం చేశారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో ప్రభుత్వం 16347 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చింది. చాలా ఆనందంగా ఉంది. గడువు పొడిగిస్తే బాగుంటుంది.

ఆనందంగా ఉంది

- రాజమ్మ, డీఎస్సీ అభ్యర్థి, శ్రీసత్యసాయి జిల్లా



2010-11లో బీఈడీ పూర్తి చేశా. టీచర్ పోస్టు సాధించాలన్నది నా కల. కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం చెప్పినట్లుగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతో చాలా సంతోషంగా ఉంది.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశాం..

గిరి ప్రసాద్, డీఎస్సీ అభ్యర్థి, చిత్తూరు జిల్లా



ఎంఏ బీఈడీ పూర్తి చేశాను. టీచర్ పోస్టు సాధించాలని ప్రిపేర్ అవుతున్నా. ప్రభుత్వం ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తోంది. నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చేశాం. ఎట్టకేలకు ఇవ్వడం ఆనందంగా ఉంది.

పలుచోట్ల వర్షం.. నేలరాలిన పంటలు

శెట్టూరులో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, రేకుల షెడ్లు



నేలకొరిగిన అరటి పంటను చూపిస్తున్న రైతు ఓబుళరెడ్డి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. గుంతకల్లులో భారీ వర్షం కురిసింది. పుట్లూరు, శెట్టూరు మండలాల్లో వడగండ్ల వాన పడింది. గుత్తిలో ఓ మోస్తారు వర్షం, అనంతపురం, బెళుగుప్ప, యాడికి ఉరవకొండ, తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

దెబ్బతిన్న పంటలు

గాండ్లపెంట: అకాల వర్షంతో పలుచోట్ల పంటలు నేలకొరిగాయి. గాండ్లపెంట మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పలు పంటలు దెబ్బతిన్నాయి. గజ్జలవాండ్లపల్లికి చెందిన ఓబుల రెడ్డి మూడున్నర ఎకరాల్లో సాగుచేసిన అరటిపంట ప్రస్తుతం కాయదశలోఉంది. ఏపుగా ఉన్న అరటి పంట నేలకొరగడంతో భారీ నష్టం జరిగింది. అలాగే అరకొరగా కాసిన మామిడికాయలు కూడా నేల రాలాయి. క్రిష్టారెడ్డి మామిడి తోటలో ఈదురుగాలలకు మామిడికాయలు రాలిపోయాయి.

తలమర్లలో పిడుగు



పిడుగు పడడంతో కాలుతున్న టెంకాయ చెట్టు

కొత్తచెరువు: మండలంలోని తలమర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం టెంకాయచెట్టుపై పిడుగు పడింది. మారుతిరెడ్డి ఇంటి ఆవరణంలో ఉన్న టెంకాయచెట్టుపై పిడుగు పడడంతో కాలిపోయింది.

నేలకొరిగిన కాకర

తనకల్లు : మండలంలోని బొంతపల్లిలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కాకర పంట నేలకొరిగింది. గ్రామానికి చెందిన ఆనంద్ ఒకటిన్నర ఎకరాల్లో సాగుచేసిన కాకర పంట నేలకొరగడంతో రూ.లక్ష నష్టం జరిగింది. కాకరకు నాటిన కట్టెలన్ని విరిగిపోయి, నేలకూలినట్లు రైతు ఆవేదన చెందారు.



నేలకొరిగిన కాకర పంట

గుంతకల్లులో భారీ వర్షం

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఆదివారం రాత్రి గాలి, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలైన కసాపురంరోడ్డు, ధర్మవరం గేటు పాతబస్టాండ్, గుంతబావి, తిలక్‌నగర్, బీఎస్ఎస్ కాలనీ, అంబమ్మదేవాలయం వద్ద పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో రోడ్లు జలమయమయ్యాయి. కాలువలు పొంగి రోడ్డు మీద నీరు పారడంతో చెత్త, చెదారం, బురదతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శెట్టూరులో గాలివాన బీభత్సం

శెట్టూరు: గాలివాన బీభత్సానికి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శెట్టూరు మండలం బొచ్చుపల్లి, గొల్లలదొడ్డిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామంలోని సన్ననాగన్న, సన్న తిమ్మక్కకు చెందిన రేకుల షెడ్డు మొత్తం గాల్లో ఎగిరింది. దీంతో ఆ గ్రామంలో ఏ నిమిషం ప్రమాదం ముంచుకొస్తుందో అని భయభ్రాంతులకు గురయ్యారు. బసంపల్లిలో ఈదురుగాలులకు అనిల్ అనే రైతుకు చెందిన బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. మారెమ్మగుడి సమీపంలో పెద్ద వృక్షం విద్యుత్ తీగలపై పడి సరఫరా ఆగిపోయింది. అయ్యగార్లపల్లిలో వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల దెబ్బకు బొప్పాయి తోట నేలమట్టమైంది.



బొచ్చుపల్లిలో ఈదురుగాలులకు లేచిపోయిన రేకులషెడ్డు



బొచ్చుపల్లిలో పడిపోయిన విద్యుత్ స్తంభం

మాజీ ఎంపీ కేఎం సైఫుల్లాకు పుత్రశోకం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

కేఎం జకీవుల్లా గుండెపోటుతో మృతి



జకీవుల్లా (ఫైల్)

అనంతపురం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు, అనంతపురానికి చెందిన కేఎం సైఫుల్లాకు పుత్రశోకం కలిగింది. ఆయన తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం జకీవుల్లా (51) హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో కేఎం జకీవుల్లా హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆయనకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం స్టంట్ వేసేందుకు ఆస్పత్రి వైద్యులు నిర్ణయించారు. ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉండగానే ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉన్నఫలంగా ఆయనకు గుండెనొప్పి రావడంతో వైద్యులు వెంటనే స్పందించి వైద్యం అందించేందుకు ప్రయత్నించేలోపే జకీవుల్లా తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ సైఫుల్లా బాధ వర్ణనాతీతం. ఆయనకు ఇద్దరు కుమారులైతే.. దాదాపు రెండు దశాబ్దాల క్రితం పెద్ద కుమారుడు కేఎం రహంతుల్లాను కోల్పోయాడు. ఆ బాధ నుంచి చాలా ఏళ్ల తర్వాత ఆయన కోలుకున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా 2004 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచారు కేఎం రహంతుల్లా. ఆ ఎన్నికల్లో ఓడిపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది తన రివాల్వర్‌తో కాల్చుకుని, ఆత్మహత్య చేసుకున్నారు. అయినా ఆ కుటుంబం తెలుగు దేశం పార్టీని వీడలేదు. రహంతుల్లా సోదరుడు, సైఫుల్లా తనయుడు కేఎం జకీవుల్లా తెలుగు దేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన ముందుగా తెలుగుదేశం పార్టీ మద్దతుతో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై, పనిచేశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో ఎన్నో పదవులు చేపట్టారు. 11 ఏళ్లుగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా కూడా ఆయన పనిచేశారు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గ పరిశీలకుడిగా కొనసాగుతున్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలోనూ కేఎం జకీవుల్లా తనదైన ముద్ర వేసుకున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీ వర్గాల్లో కేఎం జకీవుల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందనడంలో అతిశయోక్తి లేదు. పార్టీ కార్యక్రమాలే కాకుండా... పేదలకు సాయం అందించడంలోనూ ముందుండేవారు. అలాంటి నాయకుడు గుండెపోటుతో మరణించడం తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

కేఎం జకీవుల్లా గుండెపోటుతో చనిపోయాడన్న సమాచారంతో పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు.. అనంతపురంలోని కేఎం సైఫుల్లా ఇంటికి చేరుకున్నారు. కుమారులు ఇద్దరిని పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉన్న కేఎం సైఫుల్లాను పలువురు పరామర్శించి, ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు శ్రీధర్ చౌదరి, గౌస్‌మొద్దీన్, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాయల్ మురళి, నెట్టెం వెంకటేష్, సింగవరం రవీంద్ర, బుక్కచెర్ల నల్లపురెడ్డి తదితరులు.. సైఫుల్లాను పరామర్శించిన వారిలో ఉన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాల్దీవ్ పర్యటనలో ఉన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ మంత్రి కోట్ల సుజాతమ్మ ఫోన్‌లో సైఫుల్లాను పరామర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. కాగా కేఎం జకీవుల్లా పార్థివ దేహాన్ని అనంతపురానికి అంబులెన్స్‌లో తీసుకొస్తున్నారు. సోమవారం ఉదయం డ్రైవర్స్ కాలనీలోని ముస్లిం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



చింతకుంట హరినాథ్‌రెడ్డి(ఫైల్)

శింగనమల ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం నాలుగేళ్లు ప్రయత్నించి విఫలమైన ఓ నిరుద్యోగ యువకుడు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన చింతకుంట హరినాథ్‌రెడ్డి(29) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. చిన్నజలాలపురం గ్రామానికి చెందిన రైతు చింతకుంట ఆదిరెడ్డి, ఓబులమ్మ దంపతుల కుమారుడు చింతకుంట హరినాథ్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. బెంగళూరు, హైదరాబాద్‌లో గత నాలుగు సంవత్సరాల నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నించినా రాకపోవడంతో ఇంటి వద్దనే తండ్రికి వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండేవాడు. శనివారం రాత్రి తోట వద్దకు పడుకోవడానికి వెళ్లాడు. ఉద్యోగం రాలేదనే మనస్థాపంతో అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం పొలాల వద్దకు వెళుతున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు ఇలా మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసముద్రం మునిగిపోయారు.

మేధస్సును కదిలించేది 'శ్రమకావ్యం'

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మేధస్సును కదిలించేది 'శ్రమకావ్యం' అని ప్రముఖ సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీఐటీయూ, ఐద్వా, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ రచించిన 'శ్రమకావ్యం' పుస్తక గాన సభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత సుద్దాల అశోక్‌తేజ జీవితం గురించి సాహితీ స్రవంతి నాయకురాలు డాక్టర్ ప్రగతి వివరించారు. రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుద్దాల అశోక్ తేజ రచనలు శ్రమ, శక్తిని చాటిచెప్పేవిగా ఉన్నాయన్నారు. శ్రమ కావ్యమే కాకుండా నేను అడవి, శూద్రగంగ వంటి రచనలు గొప్పగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ... శ్రమకావ్యం పుస్తకంలో శ్రమ విలువను వ్యక్తపరిచినట్లు తెలిపారు. శ్రమ అంటే మేధో శ్రమ, శారీరక శ్రమ అని రెండు రకాలుగా ఉంటాయని, ఈ రెండు కలగలిసి ప్రయాణం చేస్తుంటాయని వివరించారు. దీనినే శ్రమయాణం అనికూడా పేర్కొనవచ్చు అన్నారు. శ్రమ ద్వారానే సామాజిక గమనం ఉంటుందని శ్రమకావ్యం గానం ద్వారా ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆర్‌వీ నాయుడు, లింగన్న, పరమేష్, నల్లప్ప, రాంభూపాల్, ఎస్ఎం బాషా, బోస్, మానవత తరిమెల అమర్‌నాథరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

ఘనంగా సీఎం చంద్రబాబు పుట్టినరోజు

జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం మరిన్ని పుట్టి రోజులు జరుపుకోవాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


అనంతపురం రూరల్ తపోవనంలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


ప్రభాకర్ చౌదరి నివాసంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


నగరంలోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు


ఎస్కేయూలో సంబరాల్లో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ అనిత, ప్రొఫెసర్లు, ఉద్యోగులు


చెన్నేకొత్తపల్లిలో...


గార్లదిన్నెలో కేక్ కట్ చేస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి


టీఎన్ఎస్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు


సిద్దరాంపురంలో కేక్ కట్ చేస్తున్న పసుపుల నారాయణరెడ్డి


శింగనమల: పెరవలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


ఆత్మకూరులో...


రాప్తాడులో..

నీటిరంగుతో చంద్రబాబు చిత్రపటం

రామగిరి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయుడు శ్రీరాములు నీటిరంగులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రాన్ని గీశారు. సీఎం చంద్రబాబు 75వ జన్మదినసందర్భంగా ఆయన రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషికి స్పందించి ఈ చిత్రాన్ని గీసినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు.



కళలకు పుట్టినిల్లు అనంతపురం: ఎంపీ


పురస్కార గ్రహీతలతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కళలకు పుట్టినిల్లు అనంతపురం జిల్లా అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి సంబంధించి ఇటీవల కందుకూరి విశిష్ట పురస్కారాలు అందుకున్న 13 మంది అనంతపురం జిల్లా కళాకారులకు ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని లలితకళా పరిషత్‌లో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో కళలకు కొదవ లేదని, ఎంతో మంది కళాకారులు సినీ రంగంలో సైతం రాణిస్తుండడం గర్వకారణమన్నారు. కాలక్రమేణా జిల్లాలో షూటింగ్‌లకు సైతం మంచి వేదికగా మారుతోందన్నారు. జిల్లాకు చెందిన 13 మంది కళాకారులు కందుకూరి విశిష్ట పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. కళాకారుల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేయడంతోపాటు వారిని ప్రభుత్వం తరఫున పురస్కారాలతో సత్కరిస్తోందన్నారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్‌కేపీ అధ్యక్షుడు గురుప్రసాద్, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, రామగోవింద్ సాగర్, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, అస్లాం బాషా, పురస్కార గ్రహీతలు వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీనారాయణ, సంగాల నారాయణస్వామి, పి.ఆనంద్, జేకే రామాంజనేయులు, వి.ఆదినారాయణరెడ్డి, జీజే ఎర్రిస్వామి, ఎ.రామగోపాల్, జి.నరహరి, ఎస్.నారాయణస్వామి, శివశంకర్, డి.రాజ కుళ్లాయప్ప, బి.వరప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని నిరోధక యంత్రాలు అందుబాటులో ఉండాలి
- ఇన్‌చార్జ్ డిప్యూటీ ఆర్ఎంఓ కార్తీక్‌రెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అగ్ని నిరోధక యంత్రాలను తగిన విధంగా అందుబాటులో ఉంచుకోవడం వల్ల నష్ట శాతాన్ని తగ్గించుకోవచ్చని డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ కార్తీక్ రెడ్డి, పేర్కొన్నారు. ఆదివారం జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడీఎఫ్ఓ లింగమయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి ఎలాంటి అగ్ని ప్రమాదాలకు ఏ నిరోధక పరికరాలు వినియోగించాలి, వాటిని ఎలా వాడాలన్నదానిపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించామని తెలిపారు. అన్ని రంగాల వారికి అవగాహన కల్పించే విధంగా ప్రణాళిక తయారు చేసి అమలు చేశామని అన్నారు. అగ్నిమాపక శాఖ విశ్రాంత ఉద్యోగులు కృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, వీరాంజనేయులు తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినులు, స్పిన్నింగ్ ఫ్యాక్టరీల సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి చేయూత

రామగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమేకలపల్లి గ్రామానికి చెందిన కురుబ జనార్దన్ అనే గొర్రెల కాపరికి రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా ఆదివారం చేయూత అందించారు. నెల రోజుల క్రితం జనార్దన్‌కు చెందిన 11 గొర్రెపిల్లలు అగ్నిప్రమాదంలో మృతిచెందాయి. రామగిరి పోలీసులు స్పందించి కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా తోటి గొర్రెలకాపరులతో చర్చించి బాధిత కాపరికి సాయం చేయాలని కోరారు. వారు 10 గొర్రెపిల్లలను అందించారు. వీటిని దాతల చేతులమీదుగా బాధితుడికి అందజేశారు.

బిల్లు లేకుండా సరుకులు తస్కరించే యత్నం
● ఓ మార్ట్‌లో బిల్లు వేసే అమ్మాయిపై దాడి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ, మరో వ్యక్తి స్కార్పియోలో ఓ ఫ్యామిలీ మార్ట్‌లోకి వెళ్లారు. మార్ట్‌లో లభించే బాస్కెట్‌లో కొన్ని వస్తువులు తీసుకున్నారు. మరో బ్యాగ్‌లో కొన్ని వస్తువులు తీసుకున్నారు. బిల్లు వేయించే సమయంలో బాస్కెట్‌లో వేసిన వస్తువులే ఇచ్చారు. బిల్లు వేసే అమ్మాయి ప్రశ్నించింది. దీంతో అప్పుడు ఆ బ్యాగ్‌లో ఉన్న వాటిని కిందకు వేశారు. ఈ విషయంలో వాగ్వాదం నెలకొంది. తాము ఎవరనుకున్నావ్... అధికారపార్టీ వాళ్లం అంటూ గొడవకు దిగారు. ఆ అమ్మాయిపై వస్తువులతో దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నగరంలోని ఎస్ఎస్‌బీఎన్‌లో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న హరిత వరుసకు బాబాయి శ్రీనివాస చక్రవర్తి ఇంట్లో నివాసముంటోంది. చక్రవర్తికి శాంతినగర్ బోర్డులోని వియాన్సీ ఫ్యామిలీ మార్ట్‌కు హరిత తరచూ వెళ్తుండేది. కొన్ని సందర్భాల్లో బిల్లు వేస్తుంటుంది. 19వతేదీ పయ్యావుల లోక్‌నాథ్, సాకే నాగమణి మార్ట్‌కు వెళ్లారు. హరిత బిల్లు వేయగా రూ.200 అయింది. మరో బ్యాగ్‌లో ఉన్న వస్తువులు బయటకు తీయమని హరిత కోరింది. ఆ వస్తువులు బయటకు తీశారు. ఈ క్రమంలో నాగమణి హరితతో వాదనకు దిగింది. నాగమణి తనపై దాడి చేసిందని హరిత త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నాగమణి, లోక్‌నాథ్, దుర్గాప్రసాద్‌లపై కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 20: శింగనమల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకుడు బుసగాని నారాయణ(75) గుండెపోటుతో శనివారం మృతిచెందారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుతో పాటు మండలంలోని పలువురు నాయకులు నారాయణ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు నరేంద్రయాదవ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): నగరంలో జూద మాడుతున్న ఆరుగురిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం సీఐ శాంతిలాల్ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. గుత్తి రోడ్డులోని మార్కెట్‌యార్డ్ సమీపంలో పేకాట ఆడుతుండగా త్రీటౌన్ పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3200 స్వాధీనం చేసుకున్నారు.

గొడవపై పరస్పరం కేసులు

నగరంలోని శారదానగర్‌లో జరిగిన గొడవపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. శారదానగర్‌లో 17వతేదీన నాగయ్య, రమేష్ వర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

సుమయారెడ్డి సందడి..



డియర్ ఉమా సినిమా ఫేమ్ సుమయా రెడ్డి ఆదివారం నగరంలో సందడి చేశారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆమె నగరానికి వచ్చారు. గౌరీ సినిమా కాంప్లెక్స్‌లో సందడి చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తాను అనంతపురంలోని పుట్టి, పెరిగానన్నారు. తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయామన్నారు. పుట్టి పెరిగిన ఊరికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 20(ఆంధ్రప్రదేశ్): డిగ్రీ కోర్సుల్లో నైపుణ్య అంశాలను జోడించి బోధన చేస్తుండటంతో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా పొందుతున్నారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్కేయూ అనుబంధ శ్రీసాయి మాస్టర్ మైండ్స్ డిగ్రీ కాలేజ్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతాపరెడ్డితోపాటు జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ బసవయ్య ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున అధ్యక్షతన కాలేజీడే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేసి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


భక్తులకు ద్రాక్షరసం పంపిణీ చేస్తున్న పాస్టర్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల ఆరాధ్యదైవం యేసుక్రీస్తు పాపసంహారంకోసం తిరిగి అవతరించిన పవిత్ర రోజు ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చిల్లో పాస్టర్లు, మతబోధకులు యేసు పునరుత్థాన వృత్తాంతాన్ని వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు క్రీస్తును స్మరించుకుంటూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వైశ్య హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడిగా రమేష్‌బాబు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆం ధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైశ్య హాస్టల్ ట్రస్టు అధ్యక్షుడిగా పొ లమడ రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వైశ్య హాస్టల్ ఆవరణలో హాస్టల్ అధ్యక్షుడు, ట్రస్టు అధ్యక్ష స్థానాలకు ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. వైశ్య హాస్టల్ అధ్యక్షుడుగా మేడా రామనాథ్, ట్రస్టు అధ్యక్షుడిగా రమేష్‌బాబులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులను శాలువాలతో సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, పోతుల మనోజ్, ఆర్యవైశ్య మహాసభ నాయకులు కోటా సత్యం, తిరువీదుల జగదీష్‌కుమార్, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ను నాగరత్నం, శబరి, ముడియం రమణ, సత్రసాల మంజునాథ్, ఆళ్లగడ్డ రాము పాల్గొన్నారు

వైద్య విద్యను రిజర్వేషన్ వర్గాలకు దూరం చేయొద్దు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కొత్త ఫీజు విధానం ప్రకారం రూ.12లక్షలు అదనపు భారం వేసి రిజర్వేషన్ వర్గాలకు వైద్యవిద్యను దూరం చేయొద్దండని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ఏపీఎన్జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ మాట్లాడారు. కొత్త ఫీజుల విధానం పేరుతో రిజర్వేషన్ విద్యార్థులపై రూ.12లక్షలు అదనపు ఫీజు భారం మోపడాన్ని విరమించుకోవాలన్నారు. నాయకులు శంకర్, సుగప్ప పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై హర్షం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు క్యాబినేట్ ఆమోదం తెలపడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చెన్నేకొత్తపల్లిలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు దబ్బల శ్రీరాములు, ఆదినారాయణ, గంగాధర్, ముత్యాలు, నాగప్ప, ప్రవీణ్, సురేశ్, మురళీ, సుబ్బరాయుడు, ఆదిశేషయ్య, ముత్యాలు, నరసింహులు, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోండి

శింగనమల ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): శింగనమల యువ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై కొందరు నాయకులు అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని టీడీపీ మండల నాయకులు కోరారు. ఆదివారం శింగనమల టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లడుతూ ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, కేవలం కొందరు నాయకులు వ్యక్తిగతంగా తమ పనులు జరగలేదనే కారణంతో ఎమ్మెల్యేను బ్లాక్‌మెయిల్ చేసే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. అసత్యప్రచారం చేస్తూ ఎమ్మెల్యేకు ఏ సమస్యను పరిష్కరించాలని అడగకపోగా, తమను పట్టించుకోవడం లేదంటూ ఇన్‌చార్జి మంత్రి పర్యటన సమయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలకు దిగారన్నారు. ఎమ్మెల్యేపై ఎదైనా ఆరోపణలు చేసే ముందు నిజాలు ఉంటే నిరూపించాలని లేనిపోని ప్రచారాలతో పార్టీ ఎమ్మెల్యేను అబాసుపాలు చేయవద్దని కోరారు.పార్టీ అధిష్టానం ఆదేశాలు మేరకు అందరితో కలసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు తెలియజేస్తున్నారు..ఈకార్యక్రమంలో రాజుబాబు,సురేష్,పవన్,కాయలసురేష్,మహేష్,బోయవిజయ్,శంకర్‌గౌడ్ ,నానేసాబ్,బాలకృష్ణ,వడ్డేఅంజి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోశాలను సందర్శించిన కలెక్టర్


గోవులకు గడ్డి తినిపిస్తున్న కలెక్టర్

అనంతపురంటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఇస్కాన్ గోశాలను సందర్శించారు. అక్కడ అరగంటపాటు కలెక్టరు గడిపారు. గోశాల విస్తీర్ణం, ఎన్ని గోవులు ఉన్నాయి, మేత, నిర్వహణ ఎలాచేస్తున్నారు తదితర వివరాలను గోశాల ఇన్‌చార్జి దామోదర గౌరంగదాస్‌ను అడిగి తెలుసుకున్నారు.కలెక్టరు గోవులను పరిశీలిస్తూ ఆయన చేతులుమీదుగా పచ్చిగడ్డి, బెల్లం, అరటిపండ్లను తినిపించారు. అనంతరం అక్కడే ఉన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీఓ కేశవనాయుడు, నగరపాలక కమిషనర్ బాలరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, తహసీల్దార్లు పుణ్యవతి, మోహన్‌రావు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్పోర్ట్స్ పాలసీలో పారా స్పోర్ట్స్ క్రీడాకారులను గుర్తించి వర్తింప చేసినందుకు సీఎం సార్ కృతజ్ఞతలు అంటూ పారా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ కోటాలో పారా స్పోర్ట్స్‌ను గుర్తిస్తూ 3 శాతం ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ నంబరు 4 విడుదల చేసిన సందర్భంగా ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్‌తో కలిసి కేక్‌కట్ చేసి...సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. పారా స్పోర్ట్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు రాప్తాడులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురంటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి సమీపంలోని ఆర్‌జేసీ కల్యాణమండపంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని అన్నారు. జిల్లాకు చెందిన అన్నిశాఖల ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ వివరాలతోపాటు సమస్యకు సంబంధించిన అర్జీలు ఇవ్వాలన్నారు. గతంలో అర్జీలు ఇచ్చి- అదే సమస్యను మళ్లీ ఇవ్వడానికి వచ్చేవారు సంబంధిత పాత రసీదులను తీసుకురావాలని తెలిపారు.

కేఎం జకీవుల్లా మృతి బాధాకరం
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేఎం జకీవుల్లా ఆకస్మిక మృతి బాధాకరం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ క్రమంగా అభివృద్ధి చెందిన జకీవుల్లా ఆకస్మిక మృతి చెందడం ఆయన కుటుంబానికి తీరనిలోటన్నారు. రాజకీయాలు వేరైనప్పటికీ మిత్రుడుగా, సౌమ్యుడుగా వ్యవహరించేవాడన్నారు. గతంలో కేఎం రహంతుల్లా, ప్రస్తుతం జకీవుల్లా ఆకస్మిక మృతి కేఎం సైపుల్లాను తీవ్రంగా బాధించే అంశమని, ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

వీడు సాఫ్ట్‌వేర్, నేను బ్యాంక్.. నువ్వు మామా..?
● సరదాగా గడిపిన ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థులు


విద్యనేర్పిన గురువులతో పూర్వపు విద్యార్థుల సందడి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 20(ఆంధ్రప్రదేశ్): వీడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్, నేను జిల్లాలోనే బ్యాంక్ ఉద్యోగిగా చేస్తున్నాను మరి నువ్వు మామా..? అంటూ పూర్వ విద్యార్థులు వారి అధ్యాపకులతో కలిసి జీవిత విశేషాలను మురిపెంగా ముచ్చటించుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ బీకామ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మాజీ ప్రిన్సిపాల్ మురళీధర్, విభాగాధిపతి శ్రీరాములు నాయక్, అధ్యాపకుల నడుమ 2010-13 బ్యాచ్ విద్యార్థులు కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధ్యాపకులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి గౌరవించారు. అనంతరం పాటలు, డ్యాన్సులతో సందడిచేశారు. అధ్యాపకులు మల్లికార్జున, కృష్ణయ్య లోక్‌నాథ్‌రెడ్డి, ప్రభాకర్, శ్వేత, జనార్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

గార్లదిన్నె, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలిశారు. ఆనందంగా అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులకు సన్మాంచారు. ఆదివారం మర్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 1986-87 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగగా సాగింది. పూర్వవిద్యార్థులందరు ఒకచోటచేరి హాయ్ తాతిరెడ్డి, గోరకాటి రవి, మల్లికార్జున, చలపతి ఎలా ఉన్నారు... ఏం చేస్తున్నారు... ఎంత మంది పిల్లలు... ఏమి చదువుతున్నారని ఒకరికి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లో చేసిన తీపి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని పిచ్చపాటి మాటలతో రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్దులు నేర్పిన గురువు ఆనందరావు, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణలను ఆత్మీయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 38 సంవత్సరాలు తరువాత శిశువులు తమను గుర్తుంచుకొని చదువు చెప్పిన వారిని పాఠశాలకు పిలిచి ఘనంగా సత్కరించడంతో వారు ఉబ్బితబ్బిబ్బయ్యారు. పూర్వ విద్యార్థులు ప్రభ తాతిరెడ్డి, గోరకాటి రవి, పరమేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున, అమీర్‌బాషా, చలపతి, రత్నమయ్య బాగ్యలక్ష్మి, నాగమణి, లక్ష్మీదేవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మరో 15 ఏళ్లు చంద్రబాబే సీఎం: కాలవ


గర్భిణులతో కాలవ, ఆయన కుటుంబసభ్యులు

రాయదుర్గం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో 15 ఏళ్లు చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉంటారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలను పట్టణంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కాలవ దంపతులు సుమారు 75 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరికీ చీరలు, జాకెట్ పీసులు, పసుపు, కుంకుమ, గాజులు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ ప్రపంచంలోనే మన రాష్ట్రం అగ్రగామిగా ఎదగాలని అనుక్షణం పరితపిస్తున్న ప్రజానాయకుడు చంద్రబాబు మరో 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. 75 ఏళ్ల వయసులో కూడా పాతికేళ్ల యువకుడిలా రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. ఆయన నాయకత్వంలో పని చేస్తుండటం గర్వంగా భావిస్తున్నామన్నారు. అలాంటి గొప్ప నేత ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం అనుకున్న లక్ష్యాలను చేరుకోగలదని విశ్వాసం వ్యక్తపరిచారు. చంద్రబాబు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని కాలవ ఆకాంక్షించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 29.12 లక్షలు నియోజకవర్గంలోని 36 లబ్ధిదారులకు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా లబ్ధిదారులకు వాటిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే గుంతకల్లు నియోజకవర్గానికి ఇప్పటిదాకా దాదాపు రూ. కోటిన్నర సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మంచిమనసుతో ఆదుకుంటున్న చంద్రబాబుకు రానున్న రోజుల్లో ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, పత్తి హిమబిందు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

తాడిపత్రి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గన్నెవారిపల్లికాలనీలో గల సచివాలయం వద్ద ఉన్న మార్షల్ ఆర్ట్స్ జపాన్ షూటోరియో కరాటే ట్రైనింగ్ స్కూల్లో ఆదివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ను కరాటే రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 50మంది విద్యార్థులు పాల్గొనగా ఎల్లో బెల్ట్‌ను 12మంది, ఆరెంజ్‌బెల్ట్‌ను 8మంది, గ్రీన్‌బెల్ట్ 10మంది, బ్లూబెల్ట్ నలుగురు, బ్రౌన్‌బెల్ట్‌ను ఆరుగురు సాధించారని కరాటే మాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కరాటే సాధన వలన ఆరోగ్యం, ఆత్మస్థైర్యం, సెల్ఫ్ డిఫెన్స్ వంటివి చేకూరుతాయని ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన గీత అనే మహిళ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫినాయిల్ తాగి అపస్మారక స్థితిలో పడి ఉంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వసంతోత్సవం


రంగులు చల్లుకుంటూ యువకుల కేరింతలు

కంబదూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కులమతాలకు అతీతంగా ఆదివారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమల మల్లేశ్వరస్వామి రథోత్సవం, ఉట్లమాను పరుష దిగ్విజయం పూర్తయిన సందర్భంగా వసంతోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుకున్నారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న ఉట్లమాను నీటిలో రంగులు కలిపి ప్రతిఒక్కరూ చిన్న, పెద్ద తేడా లేకుండా చల్లుకున్నారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో సందడి నెలకొంది.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన డ్రోన్

యల్లనూరు, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను వేగంగా గుర్తించడానికి ప్రభుత్వం డ్రోన్ పరికరాన్ని పోలీసులకు అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. యల్లనూరు, పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లకు కలిపి ఒక డ్రోన్ మంజూరు చేశారు. ఈ పరికరం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం చేరింది. సభలు, సమావేశాల సమయంలో, అల్లర్లు జరుగుతున్న సమయంలో ఈ యంత్రం బాగా ఉపయోగపడుతుందని ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలియజేశారు.

టీడీపీలోకి 25 కుటుంబాల చేరిక

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల పంచాయతీలోని శీబాయి, గోళ్ల, పాతచెరువు గ్రామాలకు చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఆదివారం వారు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం చంద్రబాబు పాలన, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి టీడీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


గుత్తిలో కేక్ కట్ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్


వజ్రకరూరులో టీడీపీ నాయకులు


కణేకల్లులో..

ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

● ఊరూవాడా సంబరాలు జరుపుకున్న టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి 75వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం వేడుకలను పెద్దఎత్తున జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులతో పాటు ప్రజలు కేక్ కట్ చేశారు. అలాగే మిఠాయిలు పంచిపెట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే చంద్రబాబు నిత్యం కృషి చేస్తున్నారని అన్నారు. 75 ఏళ్ల వయసులోనూ యువకుడిలా రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవిస్తూ ప్రజా సంక్షేమం కోసం పని చేయాలని ఆకాంక్షించారు. పలుచోట్ల ఆలయాల్లో ఆయన పేరుమీద పూజలు, అర్చనలు చేయించారు. అన్నదానాలు చేపట్టారు. అలాగే ర్యాలీలు, బైక్‌ర్యాలీలు సైతం నిర్వహించారు.


యాడికిలో కేక్‌కట్ చేస్తున్న గ్రామస్థులు


కుందుర్పిలో టీడీపీ నాయకులు


గుంతకల్లులో కేక్ కట్ చేస్తున్న పవన్‌కుమార్ గౌడ్

గుక్కెడు నీరివ్వండి సారూ..

● తాగునీటి సమస్యపై సోషల్ మీడియాలో పోస్టు

కంబదూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. శ్రీరామిరెడ్డి పథకం నుంచి నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేదిలేక కొందరు సమీప వ్యవసాయ పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మరికొందరు ట్యాంకర్ రూ.650 లు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి తాగునీటి సమస్య వేధిస్తోందని, తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, తాగడానికి గుక్కెడు నీరు ఇవ్వండి అంటూ పలువురు పోస్టును శనివారం రాత్రి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. తాగేందుకు గుక్కెడు నీరిచ్చి ఆదుకోవాలని అధికారులను అందులో వేడుకున్నారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

కుందుర్పి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డీపాళ్యంలో పెద్ద కొట్టూరప్ప గారి రాముడుకు చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పంటకు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో పంట మొత్తం కాలిపోయింది. చేతికొచ్చిన పంట బూడిద అయిందని బాధిత రైతు వాపోయాడు. పంట చేతికి వచ్చింటే రూ. రెండు లక్షల ఆదాయం వచ్చేదన్నారు. పెట్టుబడి దాదాపు రూ. లక్ష వరకు అయిందని తెలిపారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కిడ్నాప్ కేసులో బాలిక అప్పగింత


బాలికను కర్ణాటక పోలీసులకు అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

గుంతకల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో బాధితురాలు రొఖయ్యా (8) అనే బాలికను జీఆర్పీ పోలీసులు కర్ణాటక పోలీసులకు అప్పగించారు. కర్ణాటక పోలీసుల నుంచి బాలిక కిడ్నాప్ సమాచారం శనివారం రావడంతో జీఆర్పీ పోలీసులు రైళ్లల్లో తనిఖీలను నిర్వహించారు. కర్ణాటక పోలీసుల నుంచి వచ్చిన బాలిక ఫొటో ఆధారంగా తనిఖీలు చేయగా.. అర్ధరాత్రి హంపీ ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ బోగీలో రొఖయ్యా కనిపించింది. గుర్తుపట్టిన పోలీసులు జీఆర్పీ స్టేషన్‌కు పిలుచుకొచ్చి సంరక్షణలో ఉంచుకున్నారు. ఆదివారం సమాచారం ఇవ్వడంతో గదగ్ పోలీసులు గుంతకల్లుకు వచ్చారు. వారికి బాలికను అప్పగించినట్టు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. గదగ్‌కు చెందిన ఆలీ రియాజ్, కుబేరా దంపతుల కుమార్తె అయిన తాను శనివారం ఉదయం మదరసాకు బయలుదేరగా కొందరు కిడ్నాప్‌నకు యత్నించారని, దీంతో పరుగెత్తి వచ్చి రైలెక్కానని, కిడ్నాపర్లు తనను బంధించించారని బాలిక తెలిపింది. బాలిక చెప్పిన విషయాలు పొంతన కుదరలేదని స్థానిక పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో జీఆర్పీ ఏఎస్ఐ వెంకటరమణ, ఆర్పీఎఫ్ ఏఎస్ఐలు రవిశంకర్, మురళి, బళ్లారి జీఆర్పీ కానిస్టేబుల్ లింగేశ, తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


నేలకొరిగిన విద్యుత్ స్తంభం

యాడికి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వేములపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం వీచిన గాలీవానకు 5విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చిరుజల్లులు వర్షం కూడా కురిసింది. విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు తక్షణమే తగు చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ రాజారావు తెలిపారు.

పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న వాహనాల సీజ్


అధికంగా కూలీలను తరలిస్తున్న వాహనాన్ని నిలిపిన పోలీసులు

విడపనకల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల నుంచి పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న వాహనలను ఎస్ఐ ఖాజా హుస్సేన్ ఆదివారం సీజ్ చేశారు. విడపనకల్లు సరిహద్దు ప్రాంతం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా రెండు బొలేరో వాహనాల్లో దాదాపుగా 30 మందికి పైగా కూలీలను తరలిస్తుండడాన్ని గమనించారు. వెంటనే వాటిని ఆపి సీజ్ చేసి గుంతకల్లు ఎంవీఐ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మిరప పంట కోతలకు కూలీలను ఆటోల్లో, బొలేరో వాహనాల్లో పరిమితికి మించి తరలిస్తున్నారని, అనేక చోట్ల ఇలాంటి వాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. వందల మంది గాయాలపాలయ్యారన్నారు. ఎస్పీ ఆదేశాలతో పరిమితికి మించి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు

● కూలేందుకు సిద్ధంగా ఉండడంతో భయాందోళనల్లో స్థానికులు

● విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు


శిథిలావస్థకు చేరుకున్న తాగునీటి ట్యాంక్

కంబదూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ అతిథి గృహం వెనుక ఉన్న తాగునీటి ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అప్పుడో.. ఇప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. ట్యాంకంతా పూర్తిగా నెర్రెలు చీలింది. సిమెంట్ అంతా లేచిపోయి ఇనుప కడ్డీలు కనిపిస్తున్నాయి. దీంతో నీళ్లన్నీ కూడా లీకేజీ అవుతున్నాయి. ఈ తాగునీటి ట్యాంక్ చుట్టూ అనేక నివాస గృహాలు ఉన్నాయి. ఈ శిథిలావస్థ ట్యాంకు వల్ల అక్కడివారు నిత్యం భయాందోళన చెందుతున్నారు. దీని నుంచి ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేశామని, ఎవరూ పట్టించుకోవడం వాపోతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఈ తాగునీటి ట్యాంక్‌కు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.


సిమెంట్ పెచ్చులు ఊడిపోవడంతో ఇనుప కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం


నెర్రెలు చీలిన ట్యాంక్ దిమ్మెలు

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడిపత్రి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బండామసీదు ఏరియాకు చెందిన హుస్సేన్‌బీ (28) అనే మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. హుస్సేన్‌బీ, అలీ దంపతులు. కొంతకాలంగా హుస్సేన్‌బీ కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె గత శనివారం ఇంటిలో సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి తల్లి హలీబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి

పెద్దవడుగూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని అప్పేచర్ల గ్రామంలో ఆదివారం సీపీఐ సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా గత 14వారాలుగా ఉపాధి కూలీలకు బిల్లులురాలేదన్నారు. దీంతో వారు పస్తులతో అలమటిస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. అదేవిధంగా 200రోజుల పని దినాలను కల్పించడంతోపాటు రూ.700 కూలీని ఇవ్వాలన్నారు. వేసవికాలం కావడంతో పని ప్రదేశంలో కూలీలకు మజ్జిగ, టెంట్లు ఏర్పాటుచేయాలని కోరారు. నాయకులు రంగస్వామి, నారాయణస్వామి, సూర్యబాబు తదితరులు పాల్గొన్నారు.

టూల్‌కిట్లు, సర్టిఫికెట్ల ప్రదానం

తాడిపత్రి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంరోడ్డులో ఉన్న సత్యసాయి మందిరంలో ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్, ప్లంబింగ్‌లో 90రోజులపాటు ఉచిత శిక్షణ పొందిన వారికి ఆదివారం టూల్‌కిట్లను, సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు తాడిపత్రి సత్యసాయి సేవా సమితి సభ్యుడు గంగాధర్ తెలిపారు. సేవాసమితి అనంతపురం జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, కన్వీనర్ నర్సింగప్ప హాజరై వాటిని అందజేశారని చెప్పారు. సభ్యులు రత్నమయ్య, శ్రీనివాసులు, శ్రీధర్‌గుప్తా, శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దవడుగూరు, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమునిపల్లి శివారు ప్రాంతంలో పేకాట కేంద్రంపై ఆదివారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అందులో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టుచేసి, వారి వద్ద నుంచి రూ.6500 నగదు,పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తర్వాత కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

రాయదుర్గంటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే కణేకల్లు ఎస్ఎస్ ట్యాంక్ వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులను చేపడుతున్నందున పట్టణానికి రెండురోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలు తెలిపారు. విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారని దీంతో నీటిని పంపింగ్ చేయుటకు వీలు కాదని అన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. నీటి సమస్య ఉన్న కాలనీలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయుటకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గుంతకల్లుటౌన్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో ఆదివారం ఏఐటీయూసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు గురిచేసే జీఓనెం 21, 31లను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, మండల కార్యదర్శి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా సమావేశం ఏంటి?

● బస్సు ఓనర్లపై జేసీపీఆర్ మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని హైదరాబాద్‌లో ప్రైవేట్ బస్సు ఓనర్లు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడంతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పట్టణంలోని నివాసంలో ఆదివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ.. ప్రైవేట్ బస్సు ఓనర్ల పై రెచ్చిపోయారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ బస్సు ఓనర్ల సమావేశం ఎలా పెడతారన్నారు. మమ్మల్ని పిలిచినా.. పిలవకపోయినా నష్టమేమి రాదని మండిపడ్డారు. బస్సు ఓనర్లకు అవగాహన లేకపోవడంతో ఇష్టానుసారంగా బస్సులు నడిపి నష్టపోతున్నారన్నారు. బస్సులను లీజుకు ఇచ్చే పద్ధతి మానుకోవాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందే బొగ్గు బస్సులను నడిపిన చరిత్ర మాకు ఉందని అన్నారు. గతంలో అన్ని ఊర్లకు బస్సులు నడిపామని తెలిపారు. మేము కూడా తెలంగాణ వాళ్లమని, గద్వాల ప్రాంతమని చెప్పారు. మొదట్లో కడప, ప్రొద్దుటూరు, పాండిచ్చేరి బస్సులు నడిపింది మేమేనని అన్నారు. చేతగాని వారంతా బస్సు ఓనర్లు అయి పరువు తీస్తున్నారని మండిపడ్డారు. ఎన్నో ఏళ్ల నుంచి మేము బస్సులను నడుపుతున్నా కనీసం మాకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారని ఆగ్రహించారు. అనంతపురానికి బస్సులు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తాడిపత్రి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా చేపట్టిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల రాణించాలని సూచించారు. అనంతరం తాడిపత్రి సలార్ జట్టు, అనంతపురం జట్టు పోటీపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 20ఓవర్లలో 240పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి దిగిన తాడిపత్రి సలార్ జట్టు 20ఓవర్లకు 149పరుగులు చేసి ఓటమిపాలైంది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో విఘ్నేశ్వర, బత్తలపల్లి జట్లు పోటీపడ్డాయి. విఘ్నేశ్వర జట్టు 181పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బత్తలపల్లి జట్టు 18ఓవర్లకు 121పరుగులు మాత్రమే చేయగలిగింది.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


యాడికిలోని సీఎస్ఐ చర్చిలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

గుత్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు ఆర్ఎస్‌లో క్రైస్తవులు ఆదవారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ డేవిడ్‌నాయక్ ఏసుప్రభు సందేశాన్ని వినిపించారు. ఏసుక్రీస్తు శిలువపై మరణం తరువాత మానవాళి పాపాలను క్షమించడానికి భూమిపై మళ్లీ పునరుత్థరణ పొందారని వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి కార్యదర్శి చార్లెస్, కోశాధికారి ప్రసాద్‌రావు, క్రైస్తవులు పాల్గొన్నారు.

యాడికి: ఈస్టర్‌ను పురస్కరించుకుని మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలకేంద్రంలోని సీఎస్ఐ చర్చి, ఆగాపె ప్రార్థన మందిరం, కల్వరీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఏసుక్రీస్తు పునరుత్థానం సందర్భంగా ఈస్టర్‌ను జరుపుకుంటారని, ఇది మానవ జీవితాల్లో వెలుగును నింపేరోజని పాస్టర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లుకు చెందిన ధనుంజయ, రవి బైక్‌లో గుత్తి నుంచి గుంతకల్లుకు బయలుదేరారు. జగనన్న కాలనీ సమీపంలో రాగానే ముందు వెళ్తున్న ఆటోను ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి..

పుట్లూరు: మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి బోల్తాపడి భార్యభర్తకు గాయాలయ్యాయి. నార్పల మండలం నాయనపల్లికి చెందిన దంపతులు రవి,శ్రావణి పని నిమిత్తం బైక్‌పై తాడిపత్రి వచ్చి తిరిగి వెళుతుండగా.. కొండాపురం వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పలు గ్రామాల్లో వడగండ్ల వాన

పుట్లూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికాపుల, చింతకుంట, సూరేపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులు వీచడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. మరికొన్నిచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మిగతా గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది.

పెన్నహోబిలంలో తేనెటీగల దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తేనెటీగల దాడిలో గాయపడిన వారు

ఉరవకొండ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలంలో ఓ కుటుంబంపై తేనేటీగలు దాడి చేశాయి. వెలిగొండకు చెందిన యు గంధర్ బంధువులు పెన్నహోబిలానికి దైవదర్శనానికి వెళ్లారు. అనంతరం భోజనం చేసే సమయంలో ఒక్కసారిగా తేనేటీగలు దాడి చేయ గా.. 10మంది అస్వస్థతకు గురయ్యారు. వారిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పూలే చిత్రం విడుదలకు ఆటంకాలు సరికాదు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల జీవితం ఆధారంగా నిర్మించిన సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు ఆటంకాలు సృష్టించడం సరికాదని శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీ పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం వివిధ ప్రజాసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ మహారాష్ట్రలో దర్శకుడు అనురాగ్ కశ్యప్ మహాత్మాజ్యోతిరావు పూలే దంపతుల జీవితం ఆధారంగా నిర్మించిన సినిమాకు సెన్సార్ బోర్డు క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో విడుదలకు నోచుకోలేదన్నారు. తక్షణమే సినిమా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, భారతి సాహితీ సమితి కార్యదర్శి గంగరాజు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చలపతి, కళాసమితి అధ్యక్షుడు రాముడు, ఆర్డీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


మాట్లాడుతున్న ఫైర్ అధికారి మోహన్‌బాబు

తాడిపత్రి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రానికి టెక్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు వచ్చారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి మోహన్‌బాబు మాట్లాడుతూ ఆపద సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు చేసే సేవలను వివరించారు. ఎల్‌పీజీ గ్యాస్ ప్రమాదాల నివారణను డెమో రూపంలో చూపారు. నీటిద్వారా మంటలను ఆర్పేవిధానాన్ని వివరించారు.